క్లుప్తంగా

ప్రథమ చికిత్స కేంద్రాల సేవలు భేష్



ఆలయం లోపల ఏర్పాటు చేసిన వైద్య కేంద్రంలో వైద్య సిబ్బంది

శ్రీకాళహస్తి రూరల్: మహాశివరాత్రిని పురస్కరించుకుని జిల్లా వైద్యశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 13నుంచి శ్రీకాళహస్తిలో ఐదు ప్రథమ చికిత్స వైద్య కేంద్రాల్లో అత్యవసర వైద్య సేవలు అందించారు. ఆదివారం రథోత్సవం సందర్భంగా నాలుగు మాడ వీధుల్లో, ఆలయం లోపల, దూర్జటి కళాప్రాంగణం, తెప్పోత్సవం వద్ద కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 9 గంటలకు తెలంగాణకు చెందిన భక్తుడు రాజు రాహుకేతు సర్పదోష నివారణ పూజ చేసుకుంటున్న తరుణంలో సొమ్మసిల్లి పడిపోయాడు. ఆలయం లోపల ఏర్పాటు చేసిన ప్రథమ చికిత్స కేంద్రం సిబ్బంది కామరాజు, రామమూర్తి హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని ప్రథమ చికిత్స అందించారు. అనంతరం దేవస్థానం అంబులెన్స్ ద్వారా స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ మెరుగైన వైద్యం అందించగా క్షేమంగా కుటుంబ సభ్యులతో అక్కడి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. రథోత్సవం సందర్భంగా తొక్కిసలాటలో బొక్కసంపాలెం గ్రామానికి చెందిన గురుప్రసాద్‌కు స్వల్ప గాయాలయ్యాయి. అక్కడే ఉన్న వైద్య సిబ్బంది ప్రథమ చికిత్స అందించారు. డాక్టర్ తేజేశ్వరి మాట్లాడుతూ తిరుపతి జిల్లా వైద్యాధికారి శ్రీహరి ఆదేశాల మేరకు ఈ నెల 13 నుంచి 26వరకు ప్రతమ చికిత్స వైద్య కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వైద్యులు బాలుహుస్సేన్, శ్రీవాణి, మోహన్‌రంగ, ఉమ, చంద్రశేఖర్, జావెద్ ఈ కేంద్రాల్లో సేవలందిస్తున్నట్లు వివరించారు.

అన్నదానం



బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని బుచ్చినాయుడుకండ్రిగలోని వినాయక వీధి, శ్రీవేంకటేశ్వరస్వామి కాలనీవాసులు శివరాత్రి సందర్భంగా ఆదివారం 300 మందికి అన్నదానం చేశారు. వినాయక ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం చేశారు. భక్తులు భారీసంఖ్యలో పాల్గొన్నారు.

మాజీ సూపరింటెండెంట్ మృతి



పోలంరెడ్డి గంగిరెడ్డి(ఫైల్)

శ్రీకాళహస్తి రూరల్: శ్రీకాళహస్తీశ్వరాలయం మాజీ సూపరింటెండెంట్ పోలంరెడ్డి గంగిరెడ్డి(80) ఆదివారం మృతి చెందారు. గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ స్వగ్రామం మండలంలోని ఊరందూరులోనే కన్నుమూశారు. ఈయన శ్రీకాళహస్తీశ్వరాలయంలో 40 ఏళ్ల పాటు విధులు నిర్వర్తించారు.

వైభవంగా వాలీశ్వరుని కల్యాణం

వరదయ్యపాళెం: మండలంలోని కామాక్షీదేవి సమేత వాలీశ్వరస్వామి ఆలయంలో ఆదివారం సాయంత్రం స్వామిఅమ్మవార్ల కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. సాయంత్రం 4 నుంచి 6 గంటల మధ్యలో శివపార్వతుల కల్యాణోత్సవం నిర్వహించారు. పెళ్లి పెద్దలుగా ఆలయ ధర్మకర్త మాయాని శేఖర్‌రెడ్డి, చెంచులక్ష్మి దంపతులు వ్యవహరించారు. అనంతరం 7 గంటలకు నంది వాహనసేవ నిర్వహించారు.

భారతజాతి రక్షకుడు శివాజీ

శ్రీకాళహస్తి: భారతజాతి రక్షకుడు శివాజీ అని మరాఠా అసోసియేషన్ శ్రీకాళహస్తి అధ్యక్షుడు జర్దన్‌రావు పవార్ అన్నారు. ఛత్రపతి శివాజీ జయంతిని పురస్కరించుకుని మరాఠా అసోసియేషన్ ఆధ్వర్యంలో ది స్కూల్‌ప్రాంగణంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. జనార్దన్‌రావు పవార్ మాట్లాడుతూ శివాజీ అందించిన సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతి భారతీయుడు బాధ్యతగా భావించాలన్నారు.

రథోత్సవం.. భక్తజనసంద్రం

- కనులపండువగా రథోత్సవం
- కిక్కిరిసిన శ్రీకాళహస్తి
- మొక్కులు తీర్చుకున్న భక్తులు

తొట్టంబేడు (శ్రీకాళహస్తిరూరల్): బ్రహ్మ సారథ్యంలో... భూమి రథంగా, సూర్య చంద్రులు రథ చక్రాలుగా, వేదాలు గుర్రాలుగా సాగిన ముక్కంటీశుని రథయాత్ర భక్తులను పులకింపచేసింది. హాలాహలం మింగిన పరమశివుడు, మేల్కొన్న తర్వాత బ్రహ్మ చేసిన ఉత్సవమే రథోత్సవం. ఈ రథోత్సవంలో పాల్గొంటే పుణ్యం ప్రాప్తిస్తుందని పురాణగాథ. ఈ క్రమంలోనే ఆదివారం శ్రీకాళహస్తిలో నిర్వహించిన స్వామి అమ్మవార్ల రథోత్సవానికి వేలాదిమంది భక్తులు తరలివచ్చారు. ముక్కంటీశుని వైభవాన్ని కనులారా తిలకించి, పరవశించి పోయారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీకాళహస్తిలో ఆరోరోజు రథోత్సవం నిర్వహిస్తారు. ఆలయంలో స్వామి, అమ్మవార్లకు ఉదయం అభిషేకాలు పూర్తయిన తర్వాత ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా ఆలయం వెలుపలకు వేంచేపు చేసి, నెప్పల మండపంలో ఉంచి పూజలను నిర్వహించి రథంపైన కొలువుదీర్చారు. మొదట గంగాదేవి సమేతుడైన సోమస్కందమూర్తి రథాన్ని ప్రారంభించారు. ఆ తర్వాత జ్ఞాన ప్రసూనాంబ రథానికి పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి, ట్రస్ట్ బోర్డు చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ఈఓ సాగర్ బాబు రథాన్ని లాగి ఉత్సవాన్ని ప్రారంభించారు. రథం కదలగానే హరహర మహాదేవ శంభో శంకర అంటూ శివనామ స్మరణ మాడవీధుల్లో మార్మోగిపోయింది. ముందుగా స్వామివారి రథాన్ని భక్తులు తేరువీధి, నెహ్రూవీధుల మీదుగా పెండ్లిమండపం వద్దకు చేర్చారు. ఆ తర్వాత అమ్మవారి రథం అక్కడికి చేరుకుంది. సుమారు మూడుగంటలకు పైగా జరిగిన రథోత్సవంలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. ఎండతీవ్రత ఎక్కువగా ఉన్నప్పటికీ భక్తులు ఏ మాత్రం లెక్క చేయలేదు. ఉప్పు, మిరియాలను రథాలపై చల్లి మొక్కులు చెల్లించుకున్నారు.

దారులు మూసిన పోలీసులు

పోలీసులు పట్టణంలోని నాలుగు మాడ వీధులను ఉదయం పదిగంటల నుంచే దిగ్బంధం చేశారు. పట్టణంలోనికి వచ్చే అన్నిదారుల్లోనూ బారికేడ్లు ఏర్పాట్లు చేయడంతో ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. రథాలు లాగిన సమయంలో ఒక్కసారిగా జనాలు రావడంతో రోడ్డుకు ఇరువైపులా ఉన్న భక్తులు కొందరు గాయపడ్డారు. అయితే ఈసారి గతం కంటే రథాలను వేగంగా లాగడంతో భక్తుల దర్శనానికి లోటు ఏర్పడింది. రథ నిర్వాహకులు మైకుల ద్వారా ఎంతమొత్తుకున్నా రథం లాగే భక్తులు మాత్రం వేగం తగ్గించలేదు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూధన్‌రెడ్డి, చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈవో కె.వి.సాగర్‌బాబు, ఉత్సవాల ప్రత్యేకాధికారి రామచంద్ర మోహన్, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

రథోత్సవంలో సాంకేతిక బృందం సేవలు భేష్

శ్రీకాళహస్తి: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా 6వ రోజు జరిగిన రథోత్సవాన్ని సాంకేతిక నిపుణుల పర్యవేక్షణలో ఎంతో వైభవంగా నిర్వహించారు. స్వామి అమ్మవార్ల రథాలను లాగేందుకు వచ్చిన వేలాదిమంది భక్తులతో మాడ వీధులు కిక్కిరిసిపోయాయి. మాడవీధులు చాలా ఇరుగ్గా ఉండటం, నవచండి వినాయకుల వద్ద సర్కారు హారతి ఇవ్వాల్సి ఉండడంతో ఎంతమంది లాగినా సాంకేతిక నిపుణుల సాయం లేకపోతే రథోత్సవం కష్టమవుతుంది. అయితే 30 మంది సాంకేతిక నిపుణులు ఈ రథం సజావుగా నాలుగు మాడవీధుల్లో కదలడానికి, మలుపులు తిరగడానికి, ఆగడానికి సహకారం అందించారు. వీరిలో ఆనందాచారి బృందం, మరో బృందం పానగల్‌కు చెందిన ముత్తు, ఆయన కుమారుల బృందం చాకచక్యంగా వ్యవహరించారు. ఆనందాచారి స్వామివారి రథం ముందు టెంకాయి, గుమ్మడికాయ కొట్టి బ్రేకులు వేసే కార్యక్రమాన్ని చేపట్టగా, ముత్తు బృందం రథం ఎత్తుపల్లాల నుంచి కదలడానికి సాయం అందించింది. ముత్తు బృందంలోని చంద్రశేఖర్‌రెడ్డి, ఖ్యాతిశ్రీ మలుపుల వద్ద కీలకంగా వ్యవహరించారు. వారందరినీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు ఘనంగా సన్మానించారు.



శ్రీకాళహస్తిలో రథోత్సవానికి హాజరైన అశేష భక్తజనం



రథోత్సవంలో కాంతార కళాకారులు

తండ్రిబాటలో ఖ్యాతిశ్రీ

ఖ్యాతిశ్రీ తిరుపతి టీటీడీ కళాశాలలో బీఎస్సీ న్యూరాలజీలో ద్వితీయ సంవత్సరం చదువుతోంది. శ్రీకాళహస్తి రథోత్సవాన్ని చంద్రశేఖర్‌రెడ్డి తరతరాలుగా సాయం చేస్తున్నారు. ఆయనకు మగపిల్లలు లేకపోవడంతో ఖ్యాతిశ్రీ తండ్రి బాటలో నడుస్తూ రథచక్రాల కింద చెక్కలను వేసి ముఖ్యపాత్ర పోషించారు.

భక్తులకు అన్నదానం



అన్నదానం చేస్తున్న పూర్వవిద్యార్థులు

మహాశివరాత్రి ఉత్సవాల్లో రథోత్సవం పురస్కరించుకుని పలువురు దాతలు అన్నదానం, మజ్జిగ పంపిణీ చేశారు. సీపీఐ నాయకులు, ప్రజాసంఘాలు, 1982,-83వ పదవ తరగతి విద్యార్థులు, కార్తికేయ సేవాసంఘం అన్నదానం చేశారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో రథం లాగిన భక్తులు స్వచ్ఛంద సంస్థలిచ్చిన అన్నపానీయాలతో ఉపశమనం పొందారు. చాముండేశ్వరీ దేవాంగ చేనేత సంఘం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం, మజ్జిగ అందజేశారు. కార్యక్రమంలో గురునాథం, జయరామయ్య, వెంకటరామయ్య, సుధాకర్ పాల్గొన్నారు. మాడ వీధులు, రామసేతువంతెన, ఆర్చి దగ్గర పలు ఉపాధ్యాయ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు అన్నదానం, మజ్జిగ, మంచినీరు అందించాయి.

ముక్కంటికి నృత్య నివేదన



కళాకారుల నృత్య ప్రదర్శనలు

శ్రీకాళహస్తి రూరల్: వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా దూర్జటి కళా ప్రాంగణం వేదికపై ఆదివారం ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. శ్రీకాళహస్తికి చెందిన లహరి, హాసిని, సాత్విక, జాహ్నవి, సూళ్లూరుపేటకు చెందిన సులోచన నృత్య ప్రదర్శనలు భక్తులను అలరింపచేశాయి. తిరుపతికి చెందిన మంజుల, వాణి భక్తి రంజని కార్యక్రమం ఆహుతులను ఆకట్టుకుంది. తెనాలికి చెందిన శ్రీలక్ష్మి కూచిపూడి కళాక్షేత్రం నృత్య ప్రదర్శన, తిరుమల ఆర్ట్స్ అకాడమి, గుంటూరు యం.ఆర్.వి.యస్ నాగలక్ష్మి బృందం నృత్య ప్రదర్శన, కలై మామణి, టి.ముత్తు కుమారస్వామి బృందంచే నాదస్వర లయ విన్యాసం, రేణిగుంటకు చెందిన శ్రీ శారదా నాటక కళామండలి యం.శ్యాంసాయి ఆధ్వర్యంలో ప్రదర్శించిన పౌరాణిక నాటకం సత్యహరిశ్చంద్ర భక్తులను పులకరింప చేశాయి.

నయనానందకరం తెప్పోత్సవం



తెప్పోత్సవంలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఆలయ పాలకమండలి సభ్యులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం రాత్రి నారదపుష్కరిణిలో శివపార్వతులు తెప్పోత్సవం నయనానందకరంగా సాగింది. మొదట అలంకార మండపంలో శివపార్వతులకు విశేష అలంకరణ చేశారు. ఆలయ వేదపండితులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను చప్పరాలపై అధిష్టించి మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ బాబు అగ్రహారంలోని నారదపుష్కరణి వద్దకు తీసుకువచ్చారు. నారదపుష్కరిణిలో శ్రీకాళహస్తీశ్వరుడు, జ్ఞానప్రసూనాంబ తెప్పలపై ఆశీనులయ్యారు. అనంతరం పుష్కరిణిలో ఐదు చుట్లు విహరిస్తూ భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈవో సాగర్‌బాబు, ఉభయదారులు, పాలకమండలి సభ్యులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

వేడుకగా శ్రవణోత్సవం



ఉభయనాంచారులతో కల్యాణ వేంకటేశ్వరస్వామి

నారాయణవనం: పద్మావతీ సమేత కల్యాణ వెంకన్న ఆలయంలో ఆదివారం శ్రవణోత్సవం ఘనంగా నిర్వహించారు. శ్రీదేవీ, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి సాయంత్రం తిరుచ్చి వాహనం అధిరోహించి మాడవీధుల్లో విహరించారు. అర్చకులు ఉదయం సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి, నిత్యపూజాకైంకర్యాలు నిర్వహించారు. స్వామివారి జన్మ నక్షత్రమైన శ్రవణం సందర్భంగా ప్రత్యేక పూజలతో దూప, దీప నైవేద్యాలు సమర్పించారు. సాయంత్రం కల్యాణ వేంకటేశ్వరస్వామి ఉభయ నాంచారులతో తిరుచ్చి వాహనంపై మాడ వీధుల్లో విహరించారు. మహిళలు హారతులిచ్చి, మొక్కులు తీర్చుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఉత్సవర్లకు ఆస్థానం నిర్వహించి, నైవేద్యం సమర్పించారు. రాత్రి ఏకాంతసేవ నిర్వహించారు.

చొక్కంరెడ్డి ప్రకాష్‌కి డాక్టరేట్



వరదయ్యపాళెం: మండలంలోని కోవూరుపాడుకు చెందిన చొక్కంరెడ్డి ప్రకాష్‌కు ఆంధ్ర విశ్వవిద్యాలయం పీహెచ్‌డీ పట్టా ప్రదానం చేసింది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ ప్రొఫెసర్ విశ్వనాథం ఆధ్వర్యంలో మైక్రో స్మాల్, మీడియం ఎంటర్‌ప్రైజెస్ అన్న అంశంపై సమర్పించిన వ్యాసానికి డాక్టర్ ఆఫ్ పిలాసఫీ (పీహెచ్‌డీ) ఇచ్చినట్లు ప్రకాష్ పేర్కొన్నారు. ప్రకాష్‌కు సన్నిహితులు, కుటుంబ సభ్యులు, అధ్యాపకులు, కోవూరుపాడు ప్రజలు అభినందనలు తెలిపారు.

దుస్తులు, విద్యాసామగ్రి పంపిణీ



శ్రీకాళహస్తి రూరల్: యువనేస్తం అసోసియేషన్ ఆధ్వర్యంలో మండలంలోని వేడాం పంచాయతీ పరిధిలోని భైరవ ఎస్టీకాలనీ విద్యార్థులకు ఆదివారం ఒక జత దుస్తులు, విద్యా సామగ్రి పంపిణీ చేశారు. యువనేస్తం అసోసియేషన్ అధ్యక్షుడు మునిశేఖర్‌తో పాటు వెంకటేష్, నాగమణి పాల్గొన్నారు.

చెత్త బుట్టల పంపిణీ

వరదయ్యపాళెం: మండలంలోని కృష్ణాపురంలో లోకా ఫౌండేషన్ ఆధ్వర్యంలో 100 గిరిజన కుటుంబాలకు చెత్త నిల్వ చేసేందుకు బుట్టలను పంపిణీ చేశారు. ఆ గ్రామంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆ సంస్థ వైస్ ప్రెసిడెంట్ లోకేష్ దాసాజీ, సునీల దాసాజీ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మట్లాడుతూ తడి, పొడి చెత్తను వేర్వేరుగా నిల్వ ఉంచి పంచాయతీ చెత్త సేకరణ వాహనం వచ్చే సమయంలో వారికి అప్పగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు భువనేశ్వర్, శరత్ పాల్గొన్నారు.

ఆగమోక్తంగా బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

- నేడు ధ్వజారోహణం



అంకురార్పణ గావిస్తున్న ఆలయ అర్చకులు

శ్రీకాళహస్తి రూరల్: మండలంలోని తొండమాన్‌పురంలో వెలసి ఉన్న టీటీడీ అనుబంధాలయమైన శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి అంకురార్పణ కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి తోమాల, కొలువు, పంచాంగ శ్రవణ, అర్చన కార్యక్రమాలతో నిత్య కై ంకర్యాలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి వైఖానస ఆగమోక్తంగా ఆర్జిత నిత్య కల్యాణోత్సవం నిర్వహించారు. తదుపరి సాయంత్రం ఆరు గంటల నుంచి మృత్స్యంగ్రహణం, సేనాధిపతి ఉత్సవాలను అర్చకులు వేడుకగా నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో శాస్త్రోక్తంగా అంకురార్పణ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు.

నేడు ధ్వజారోహణం

శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం 9గంటల నుంచి 10 గంటల వరకు జరిగే ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఇందులో భాగంగా స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులకు తిరుచ్చి ఉత్సవ ఆస్థాన సేవ కార్యక్రమం నిర్వహించనున్నారు.

కనుల పండువగా కొండచుట్టు ఊరేగింపు



ఊరేగుతున్న ఆనందవల్లీదేవి సమేత పరశురామేశ్వర స్వామి ఉత్సవమూర్తులు

ఏర్పేడు: మండలంలోని గుడిమల్లం ఆనందవల్లీదేవీ సమేత పరశురామేశ్వర స్వామి కొండచుట్టు ఊరేగింపు ఆదివారం కనుల పండువగా నిర్వహించారు. పరశురామేశ్వర స్వామి ఆలయంలో ఉదయం స్వామి అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించి ఊరేగింపు ప్రారంభించారు. భజనలు, కోలాటాలు, మంగళవాయిద్యాలతో గుడిమల్లం నుంచి మిట్టమీదకండ్రిగ, పెనుమల్లం, పెన్నగడం, పాపానాయుడుపేట, మర్రిమంద, వికృతమాల, మునగలపాలెం, గోవిందవరం, చెల్లూరు, గుండ్లకండ్రిగ, పాయిల్ సెంటర్, కుక్కలగుంట గ్రామాల మీదుగా పరశురామేశ్వర స్వామి ఆలయానికి ఊరేగింపు చేరుకుంది. గ్రామాల్లో ప్రజలు స్వామి అమ్మవార్లకు పూజలు చేసి దర్శించుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి, ఆలయ చైర్మన్ నరసింహ యాదవ్, ఈఓ రామచంద్రారెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గురవారెడ్డి, ఉపాధ్యక్షుడు రాజారెడ్డి, కో–ఆప్షన్ సభ్యుడు బత్తిశెట్టి, వైస్ ఎంపీపీలు జనార్ధన్‌రెడ్డి, శ్రీనివాసులు, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు శివయ్య, సర్పంచ్‌లు సుబ్రమణ్యం, లలిత, పెంచలయ్య, రుక్మిణి, మోహనప్రియ, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ఓంకాళికామ్మల్ జాతర

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని సెలంవారి ఇండ్లుకాలనీలో ఆదివారం ఓంకాళికామ్మల్ జాతర ఘనంగా జరిగింది. సెలంవారిఇండ్లుకాలనీ గ్రామ దేవతకు కాలనీవాసులు పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. అమ్మవారి విగ్రహాన్ని పూలతో అలంకరించారు. గ్రామస్తులు పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భారీస్థాయిలో భక్తులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా లింగోద్భవ పూజలు





పాండూరు: జ్యోతీశ్వరస్వామి ఆలయంలో లింగోద్భవ కాల పూజలు, విశేషాలంకరణలో ఆదిదంపతులు



కల్యాణోత్సవంలో కామాక్షాంభిక సమేత కైలాసనాథ ఉత్సవర్లు

వరదయ్యపాళెం: మండలంలోని పాండూరు జ్యోతీశ్వరాలయంలో మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం వేకువజామున లింగోద్భవ పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేద మంత్రోచ్ఛారణల నడుమ స్వామివారికి మహాన్యాస పూర్వక అర్చన, బిల్వార్చన, లింగోద్భవ పూజ చేశారు. భక్తులు రాత్రంతా ఆలయం వద్ద జాగరణ చేశారు. ఆలయ అర్చకులు నిరంజనాచార్యులు, ధర్మకర్త నందకుమార్ నాయుడు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

భక్తులకు అన్నదానం

వరదయ్యపాళెంలోని సిద్దేశ్వరస్వామి ఆలయం వద్ద మాజీ సర్పంచ్ బొప్పన తిలక్‌బాబు ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. తొలుత స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు వెంకటేశ్వర్లు, వైస్ ఎంపీపీ పద్మమ్మ, బొప్పన విజయ్, గుత్తి త్యాగరాజులు పాల్గొన్నారు.

కమనీయం..ఆదిదంపతుల కల్యాణోత్సవం

వరదయ్యపాళెంలోని త్రయంబకేశ్వరాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శనివారం రాత్రి 11గంటలపైన ఆదిదంపతులైన పార్వతీ పరమేశ్వరుల కల్యాణోత్సవాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. అర్చకులు రాజేంద్రప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో పార్వతీ పరమేశ్వరులను సుగంధభరిత పుష్పాలతో వధూవరులను అలంకరించారు. అనంతరం ఎంపీపీ పద్మప్రియ, దామోదర్‌రెడ్డి దంపతులు ఆధ్వర్యంలో మంగళ వాయిద్యాలు, వేద మంత్రోచ్ఛారణల నడుమ కళ్యాణోత్సవం జరిపారు. ఆదిదంపతుల కల్యాణాన్ని తిలకించేందుకు స్థానికులే కాకుండా పరిసర ప్రాంత గ్రామాల నుంచి భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు. నిర్వాహకులు పన్నెం బాలసుందరం, బొప్పన మోహనమురళి, సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నేత్రపర్వంగా శివపార్వతుల కల్యాణం

నారాయణవనం: మండలంలోని కై లాసనాథకోనలోని కామాక్షాంభిక సమేత కైలాసనాథునికి ఆర్జిత కల్యాణోత్సవం ఆదివారం నేత్రపర్వంగా జరిగింది. కైలాసనాథునికి శనివారం అర్ధరాత్రి 12 గంటలకు లింగోద్భవ మహన్యాస పూర్వక రుద్రాభిషేకాన్ని జరిపి, భక్తులకు ప్రత్యేక దర్శనం కల్పించారు. ఉదయం 7 గంటలకు మూలవర్లకు, ఉత్సవర్లకు అభిషేకాలను నిర్వహించి, దూప దీప నైవేద్యాలు సమర్పించారు. 11 గంటలకు ఆలయ ప్రాంగణంలో కామాక్షాంభిక సమేత కై లాసనాథునికి ఆర్జిత కల్యాణోత్సవం చేశారు. పాల్గొన్న దంపతులకు ఆలయ పాలక మండలి చైర్మన్ సుబ్రమణ్యం యాదవ్, ఈఓ కృష్ణానాయక్, మాజీ చైర్మన్ భాస్కర్ యాదవ్ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కల్యాణోత్సవం అనంతరం ఆలయంలో హుండీలను తెరచి భక్తుల కానుకలను లెక్కించారు. కానుకల ద్వారా రూ. 1,69,839 లభించిందని ఈఓ కృష్ణానాయక్ తెలిపారు. అలాగే పాలమంగళం ఉత్తరపుకండ్రిగలోని పాలీశ్వరస్వామి ఆలయంలో ఉదయం 10 గంటలకు ఉత్సవర్లకు ఘనంగా ఊంజల్ సేవ నిర్వహించి, భక్తులకు అన్నప్రసాదాలను అందజేశారు.